

# బాలయ్య భావోద్వేగ ప్రయాణం

**బాలకృష్ణ** సినిమా అంటే యాక్షన్, ఎమోషన్ కామన్.. వీటికితోడుగా పొలిటికల్ సీన్స్.. సెటైర్స్ కూడా తోడైతే ఇక చెప్పేదేముంది!? జనాల్లో చర్చలు.. వార్తా ఛానళ్లలో డిబేట్లు. ఇక ఆ రచ్చ మామూలుగా ఉండదు. ప్రస్తుతం కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో బాలయ్య సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బీకే 109' వర్కింగ్ టైటిల్‌గా రూపొందుతున్న ఈ సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ను దర్శకుడు బాబీ అనంతపురంలో ప్లాన్ చేశాడు. ఈ నెల మూడోవారం నుంచి బాలయ్యపై అక్కడ యాక్షన్ సన్నివేశాలు, ఎమోషనల్ సీన్స్ చిత్రీకరించనున్నట్టు సమాచారం. ఈ సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ అంతా అనంతపురంలోనే ఉంటుందని తెలుస్తున్నది. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే.. ఇది కేవలం యాక్షన్ డ్రామా మాత్రమే కాదని, కుటుంబనేపథ్యంలో సాగే భావోద్వేగ ప్రయాణమని సమాచారం. కథానుగుణంగా ద్వితీయార్థంలో పొలిటికల్ సన్నివేశాలు ఉంటాయని యూనిట్‌వర్గాల సమాచారం. వచ్చే ఏడాది సమ్మర్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాత ప్లాన్ చేస్తున్నాడు. ఇదిలావుంటే ఈ సినిమా తర్వాత బాలయ్య 'అఖండ2' చేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం. దానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ ఇప్పటికే మొదలైందని తెలుస్తున్నది. బోయపాటి కథ కూడా సిద్ధం చేశారట. ఈ రెండోభాగం సోషియోఫాంటసీ నేపథ్యంలో సాగుతుందని సమాచారం. అయితే 'అఖండ' కథకూ, 'అఖండ2' కథకూ ఏదైనా సంబంధం ఉంటుందా? లేదా.. పూర్తిగా కొత్త కథతో రానుందా? అనేది తెలియాలి. వచ్చే ఏడాది ఆగస్ట్ నుంచి ఈ సినిమా షూటింగ్ మొదలుకానున్నట్టు తెలుస్తున్నది.

# నీ పద్ధతేం నచ్చలే!



నీకు నచ్చింది ప్రపంచానికి నచ్చాల్సిన పనిలేదు. ప్రపంచానికి నచ్చింది నీకు నచ్చాలని రూల్ లేదు. ఈ సోషల్ మీడియా యుగంలో అందరూ గ్రహించాల్సిన విషయం ఇది. సామాన్యుల పోస్టులకే కౌంటర్లు తప్పడంలేదు. ఇక సెలబ్రిటీల పోస్టుల విషయంలో ఎలా ఉంటుందో ఊహించుకోండి. అందుకే అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి కూడా భయపడుతుంటారు కొందరు సెలబ్రిటీలు. ఇటీవల త్రిష ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నది. మన్సూర్ అలీఖాన్ వివాదంతో సౌత్ ఇండస్ట్రీలో త్రిష ఓ చర్చనీయాంశంగా మారింది. ఇంకా ఆ వివాదం పూర్తిగా సద్దుమణగలేదనే చెప్పాలి. ఇంతలో మరో తలనొప్పిని తెచ్చిపెట్టుకుంది త్రిష. ఇటీవలే ఆమె 'యానిమల్' సినిమా చూసింది. ఆ సినిమా అమ్మడికి తెగ నచ్చేసినట్టుంది. ఆనందం ఆపుకోలేక 'యానిమల్' పోస్టర్‌ని తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసి, 'కల్ట్ మూవీ' అంటూ రాసేసింది. అంతే.. ఇక ఆ సినిమా నచ్చని వాళ్లంతా త్రిషపై దండెత్తారు. 'ఆడవాళ్లు.. హక్కులూ.. ఆత్మాభిమానాలూ అంటూ మాట్లాడతావ్.. ఇలా స్త్రీలను అవమానించేలా తీసిన సినిమాలను మాత్రం పొగిడేస్తుంటావ్.. నీ పద్ధతి ఏం నచ్చలేదు.' అంటూ విమర్శలు గుప్పించారు. దాంతో ఈ వ్యతిరేకతను తట్టుకోలేక తన ఇన్‌స్టా స్టోరీని తొలగించేసింది త్రిష.

# మాస్ మెచ్చేలా ఆడు మచ్చా..



రవితేజ నటిస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఈ చిత్రంలోని పాటను మేకర్స్ విడుదల చేశారు. కల్యాణచక్రవర్తి సాహిత్యంతో 'ఆడు మచ్చా..' అంటూ సాగే ఈ పాటను డేవ్ జాంద్ స్వరపరచగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. గ్రామీణ వేడుకలకు అద్దంపట్టే ఊర మాస్ ఆంథమ్‌గా ఈ పాట ఉంటుందని, ఇందులో రవితేజ గెటప్, డ్రస్సింగ్ స్టైల్ విభిన్నంగా మాస్ మెచ్చేలా ఉంటాయని, నల్లచొక్కా, ధోతీ ధరించి, మెడలో రుద్రాక్షమాలతో పూర్తిగా రవితేజ కొత్త అవతారం ఈ పాటలో చూస్తారని మేకర్స్ చెపుతున్నారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా ఉంటుందని వారు చెబుతున్నారు. అనుపమా పరమేశ్వరన్, కావ్య థాపర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నవదీప్, మధుబాల ఇతర తారాగణం. ఈ చిత్రానికి మాటలు: మణిబాబు కరణం, కెమెరా: కార్తీక్ ఘట్టమనేని, కమిల్ ప్లాకి, కర్మ్ చావ్లా.

# కాలర్ ఎగరేసుకొని బయటికొస్తారు!

'ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. ఇప్పటివరకు ఈ తరహా క్యారెక్టర్ చేయలేదు. నాయకానాయికలు రిత్విక్, ఖ్యాతీ పాత్రలతో ప్రేక్షకులు ప్రేమలో పడతారు' అన్నారు నితిన్. ఆయన కథానాయకుడిగా వక్కంతం వంశీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎక్స్‌ట్రా ఆర్డినరీమ్యాన్'. ఎన్.సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మించారు. ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. నితిన్ మాట్లాడుతూ 'కామెడీ, మాస్ అంశాలతో సినిమా బాగా వచ్చింది. శ్రీలీల ఎంత బిజీగా ఉన్నా మాకు డేట్స్ కేటాయించింది. నిజ జీవితంతో తను ఎక్స్‌ట్రార్డినరీ ఉమెన్. ఈ సినిమా చూసిన నా ఫ్యాన్స్ అంతా కాలర్ ఎగరేసుకొని బయటకొస్తారు. పెద్ద హిట్ కొట్టబోతున్నామనే నమ్మకం ఉంది' అన్నారు. ఈ సినిమాలోని ప్రతి పాత్ర ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందని, రెండున్నర గంటల పాటు ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తామని దర్శకుడు వక్కంతం వంశీ తెలిపారు. ఈ సినిమా స్పెషల్ అప్పీయరెన్స్ పాత్రను చేశానని సీనియర్ నటుడు రాజశేఖర్ తెలిపారు. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉందని, ప్రత్యేక పాత్రలో నటించిన రాజశేఖర్‌గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



నితిన్, శ్రీలీల

# ఎట్టకేలకు ఇప్పుడు కుదిరింది



కల్యాణ్‌రామ్ మంచి హీరోనే కాదు, అభిరుచి గల నిర్మాత కూడా. తను ఎంచుకునే కథలే అందుకు నిదర్శనాలు. సురేందర్‌రెడ్డి, అనిల్ రావిపూడి, వశిష్ట.. ఈ ముగ్గుర్నీ దర్శకుల్ని చేసింది కల్యాణ్‌రామే. ప్రస్తుతం ఆయన అభిషేక్ నామా దర్శకత్వంలో 'డెవిల్' సినిమా చేస్తున్నారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా తర్వాత పవన్ సాదినేని దర్శకత్వంలో కల్యాణ్‌రామ్ నటించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. నిజానికి ఇది ఏనాడో అనుకున్న కలయిక. హరికృష్ణ జీవించివున్న రోజుల్లో కల్యాణ్‌రామ్, హరికృష్ణ కాంబినేషన్‌లో పవన్ సాదినేని ఓ మల్టీస్టారర్ కథను రాసుకున్నాడు. ఆ కథను కల్యాణ్‌రామ్ ఓకే చేశాడు కూడా. అయితే, హరికృష్ణ హఠాన్మరణంతో ఆ ప్రాజెక్ట్‌కు బ్రేక్ పడింది. ఇన్నాళ్లకు మళ్లీ వీరిద్దరూ కలిసి పనిచేయడానికి రంగం సిద్ధమైంది. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది. అలాగే వశిష్ఠ దర్శకత్వంలోనే 'బింబిసార2' కూడా కల్యాణ్‌రామ్ చేయనున్నారు.



# యష్ జోడీగా సాయిపల్లవి

దక్షిణాది ఇండస్ట్రీలో సాయిపల్లవి పంథా చాలా ప్రత్యేకం. కథాంశాల ఎంపికలో కొత్తదనంతో పాటు తన పాత్రల్లో వైవిధ్యానికి ప్రాధాన్యతనిస్తుంటుంది. ప్రస్తుతం ఈ భామ వరుసగా పాన్ ఇండియా చిత్రాలను అంగీకరిస్తున్నది. రణ్‌బీర్ కపూర్ హీరోగా నితీష్ తివారీ దర్శకత్వంలో రామాయణ ఇతివృత్తంతో తెరకెక్కనున్న చిత్రంలో సాయిపల్లవి సీత పాత్రను పోషించబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. అలాగే నాగచైతన్య తొలి పాన్ ఇండియా చిత్రం 'తండేల్'లో కూడా ఆమే కథానాయికగా నటిస్తున్నది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి మరో ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రంలో హీరోయిన్‌గా ఎంపికైనట్లు తెలిసింది. 'కేజీఎఫ్' సిరీస్ వంటి భారీ విజయాల తర్వాత కన్నడ అగ్ర నటుడు యష్ నటించబోతున్న తదుపరి సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా అప్‌డేట్ ఈ నెల 8న రానుంది.. జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తారని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కబోతున్న ఈ సినిమాలో నాయికగా సాయిపల్లవిని ఎంపిక చేసినట్లు తెలిసింది.





శరత్ మరార్, రాజీవ్ చిలకా, అల్లు అరవింద్, శ్రీనివాస్ చిలకా

# నిర్మాణ రంగంలోకి చిలకా ప్రొడక్షన్స్

యానిమేషన్ రంగంలో తనదైన గుర్తింపును సంపాదించుకున్న గ్రీన్ గోల్డ్ గ్రూప్ సినీ నిర్మాణ రంగంలోకి ప్రవేశిస్తున్నది. చిలకా ప్రొడక్షన్స్ పేరుతో సినిమాలను తెరకెక్కించనుంది. ఇటీవల ఈ సంస్థ బ్యానర్ లోగోను అగ్ర నిర్మాతలు అల్లు అరవింద్, శరత్ మరార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత రాజీవ్ చిలకా మాట్లాడుతూ 'డిస్నీ వరల్డ్ మాకు ఎప్పుడూ స్ఫూర్తినిస్తుంటుంది. 'లయన్ కింగ్' సినిమా చూసి అలాంటి సినిమా ఇండియాలో ఎందుకు చేయకూడదూ?.. అనిపించింది. యానిమేషన్ రంగంలో చాలా కష్టపడుతూ పైకొచ్చాం. ప్రస్తుతం రెండు తెలుగు సినిమాలు, హిందీలో ఓ చిన్న పిల్లల చిత్రాన్ని నిర్మిస్తున్నా. మరికొన్ని ప్రాజెక్ట్స్ సన్నాహక దశలో ఉన్నాయి' అన్నారు. ఇప్పటివరకు 116 యానిమేషన్ చిత్రాల్ని నిర్మించిన తమ సంస్థ సినీ నిర్మాణంతో కొత్త ప్రయాణానికి శ్రీకారం చుడుతున్నదని శ్రీనివాస్ చిలకా తెలిపారు. ఈ బ్యానర్ సినీ రంగంలో విజయవంతం కావాలని అల్లు అరవింద్ ఆకాంక్షించారు.



### తెలుగుతెరపై వచ్చిన గొప్పకథల్లో

# 'హాయ్ నాన్న' ఒకటి

'ప్రేమ అనేది ఎప్పుడూ ఒకేలా వుంటుంది. ఒకరు ప్రేమించడం.. మరొకరు తిరస్కరించడం.. మనస్పర్థలు రావడం.. విడిపోవడం.. మళ్లీ కలవడం.. అయితే కథను ఎంత యునిక్‌గా చెబుతున్నామనేది ఇక్కడ ముఖ్యం' అన్నారు సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్. ఆయన స్వరాలందించిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని, మృణాళ్‌ఠాకూర్ జంటగా నటించిన ఈ చిత్రానికి శౌర్యువ్ దర్శకుడు. బేబీ కియారా, శ్రుతిహాసన్ కీలక పాత్రధారులు. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్‌రెడ్డి నిర్మాతలు. ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా హేషమ్ అబ్దుల్ వహాబ్ మీడియాతో ముచ్చటించారు. 'దర్శకుడు శౌర్యువ్ ఈ చిత్రాన్ని వెరీ సాఫ్ట్ రొమాంటిక్‌గా తెరకెక్కించాడు. సంగీతాన్ని కూడా అంతే సాఫ్ట్‌గా తీసుకున్నాడు. ఈ సినిమాలోని లైటింగ్ విజువల్స్, మ్యూజిక్ అన్నీ దర్శకుడి అభిరుచికి తగ్గట్టు ఆహ్లాదకరంగా ఉంటాయి' అని చెప్పారు హేషమ్ అబ్దుల్ వహాబ్. పాటలోని సాహిత్యం లలితంగా ఉంటే పాట త్వరగా జనాల్లోకి వెళుతుందని, ఈ సినిమాలోని పాటలను దర్శకుడు అద్భుతంగా ప్రజెంట్ చేశాడని, గాజుబొమ్మ, సమయమా, అమ్మాడి పాటలు వినడానికే కాదు, విజువల్‌గా కూడా బావుంటాయని ఆయన చెప్పారు. తెలుగులో ఇప్పటివరకూ వచ్చిన గొప్ప కథల్లో 'హాయ్ నాన్న' ఒకటిగా నిలుస్తుందని, నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ఈ సినిమాకోసం 15మంది మ్యుజిషియన్స్ దాదాపు 40రోజులపాటు కష్టపడి పనిచేశారని అబ్దుల్ వహాబ్ తెలిపారు.

# మాధవన్ 'అదృష్టశాలి'



హీరో మాధవన్ ప్రతిభ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా, కథా రచయితగా రాణిస్తున్నారు. తమిళంతో పాటు హిందీ, ఇంగ్లీష్ చిత్రాల్లో కూడా నటించి విజయాలందుకున్నారు. ఆయన నటించి దర్శకత్వం వహించిన 'రాకెట్రీ' చిత్రం ఇటీవల ప్రకటించిన జాతీయ అవార్డులో ఉత్తమ చిత్రంగా పురస్కారాన్ని గెలుచుకున్న విషయం తెలిసిందే. ఇదిలా వుండగా మాధవన్ నటిస్తున్న తాజా తమిళ చిత్రానికి 'అదృష్టశాలి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'తిరు' వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని తీసిన మిత్రన్ జవహర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి మాధవన్ కథనందించడం విశేషం. ప్రస్తుతం విదేశాల్లో చిత్రీకరణ జరుగుతున్నది.



# విప్లవ వీరుడి కథ

క్యూబా పోరాట యోధుడు చేగువేరా జీవితం చరిత్ర ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'చే'. 'లాంగ్ లివ్' ట్యాగ్‌లైన్. బీఆర్ సబావత్ నాయక్ టైటిల్ రోల్‌ని పోషిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. సూర్యబాబు, దేవేంద్ర నిర్మాతలు. ఈ నెల 15న విడుదలకానుంది. దర్శకుడు, హీరో బీఆర్ సబావత్ నాయక్ మాట్లాడుతూ 'ప్రపంచ యువతకు స్ఫూర్తిదాయకమైన చేగువేరా బయోపిక్‌ను తెరకెక్కించడం చాలా ఆనందంగా ఉంది. ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలను ఈ సినిమాలో ఆవిష్కరించాం. వందకుపైగా థియేటర్లలో విడుదల చేయబోతున్నాం' అన్నారు. లావణ్య, సమీరా, పూల సిద్ధేశ్వర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కల్యాణ్ సమి, జగదీష్, సంగీతం: రవిశంకర్, రచయిత–దర్శకత్వం: బీఆర్ సబావత్ నాయక్.

